క్లుప్తంగా

జలగం జనార్దన్‌కు నివాళి



జనార్దన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్

అర్వపల్లి : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జెన్ను) ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ కోరారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన జనార్దన్ నాలుగవ వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం జనార్దన్ తన జీవితాన్ని అర్పించారని చెప్పారు. ఈ సందర్భంగా జనార్దన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, అరుణోదయ రాష్ట్ర నాయకుడు సంజీవ్, న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ నాయకుడు పి.పెద లింగయ్య, గ్రామ కార్యదర్శి బయ్యన్న, పి.మధుకర్, కృష్ణమూర్తి, రాములు, హరీష్, శ్రీను, మల్లయ్య, కృష్ణమూర్తి, సురేష్, ప్రకాష్, నాగయ్య, వీరయ్య, బద్రి, రమేష్ పాల్గొన్నారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి!

సూర్యాపేటటౌన్ : వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మోతె మండలానికి చెందిన ఓ మహిళ మూడోసారి గర్భం దాల్చింది. అయితే అబ్బాయా.. అమ్మాయా అని తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో చూపించారు. స్కానింగ్‌లో అమ్మాయి అని తెలియడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అబార్షన్ చేసేందుకు ప్రయత్నించగా వైద్యం వికటించి మహిళకు రక్తస్రావం ఎక్కువై పరిస్థితి విషమించింది. వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అయితే ఆసుపత్రి యాజమాన్యం మృతురాలి కుటుంబ సభ్యులకు కొంత డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిసింది. అలాగే ఆసుపత్రికి కూడా బోర్డులు తీసేసి యాజమాన్యం పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని జమ్మిగడ్డ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6:30 నుంచి 8:30 గంటల వరకు పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఆర్.సురేష్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఈనాడు ఆఫీస్, గిరినగర్, జమ్మిగడ్డ, బాలాజీ నగర్, పీఎస్‌ఆర్ సెంటర్, కొత్తగూడెం బజార్, రాజీవ్ నగర్, తులసమ్మ హోటల్, పూల సెంటర్, అలంకార్ టాకీస్ రోడ్డు, 60 ఫీట్ రోడ్, హంబట్ నగర్, చర్చి కాంపౌండ్, జాకీర్ హుస్సేన్ నగర్, తిరుమల నగర్, భగత్ సింగ్ నగర్, అంబేద్కర్ నగర్, చింతలచెరువు, అమ్మ గార్డెన్ దగ్గర, శ్రీరామ్ నగర్, బాలాజీ నగర్, కుడ కుడ రోడ్డు, ఖమ్మం రోడ్డు, విద్యానగర్, భూమి రెడ్డి హాస్పిటల్, రాజధాని టీ స్టాల్, వెల్కమ్ టీ స్టాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం అని టీయూజేఎఫ్ హెచ్ – 143 సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జే వీరయ్య, టీజేఎఫ్ వ్యవస్థాపక డివిజన్ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం పోస్టర్‌ను యూనియన్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రాపర్తి మహేష్ కుమార్, చల్లా చంద్రశేఖర్, శాంసుందర్ రెడ్డి, ఫణీంద్ర, ఉద్వర్, గునగంటి సురేష్, యాకయ్య, సైదిరెడ్డి, ప్రవీణ్, నాగేందర్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



నశీంపేటలో తడిసిన ధాన్యం బస్తాలు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు, బస్తాలు తడిసిపోయాయి. వర్షాలు పడుతుండడంతో గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతున్నారు.



ఆత్మకూరులోని వీధిలో చేరిన వర్షపు నీరు

ఫైరింజన్ వచ్చేలోగా బుగ్గే!

- అగ్నిమాపక కేంద్రానికి నోచుకోని తుంగతుర్తి నియోజకవర్గం
- జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌పైనే ఆధారం

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ రావాల్సి వస్తోంది. తుంగతుర్తి నియోజకవర్గంలోని మండలాలన్నీ సూర్యాపేట అగ్నిమాపక కేంద్రం పైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే మంటలు ఆర్పాల్సి ఉండగా సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి ఇక్కడికి ఫైరింజన్ వచ్చే సరికి జరిగే నష్టం జరిగిపోతుంది.

ఎన్నో ఏళ్లుగా పోరాటం..

తుంగతుర్తి నియోజకవర్గంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. కానీ ఇంతవరకు అగ్నిమాపక కేంద్రం మంజూరు కాలేదు. ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు గతంలో ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు వెళ్లాయి. ఆ ప్రతిపాదనలన్నీ ఫైళ్లకే పరిమితమయ్యాయి. జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లిలో ఇటీవల జమాయిల్ తోట అగ్నిప్రమాదానికి గురైంది. అయితే వెంటనే సూర్యాపేటకు ఫైరింజన్ కోసం ఫోన్ చేయగా అందుబాటులో లేదు. దీంతో నల్లగొండ జిల్లా నకిరేకల్ నుంచి ఫైరింజన్ వచ్చే సరికి ఎక్కువ నష్టం జరిగింది. ఇటువంటి ప్రమాదాలను వెంటనే అదుపుచేసేందుకు ప్రభుత్వం తుంగతుర్తి నియోజకవర్గంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బొల్లంపల్లిలోని ఓ తోటలో మంటలను ఆర్పుతున్న నకిరేకల్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది(ఫైల్)

ఫైర్‌స్టేషన్‌ను మంజూరు చేయాలి



తుంగతుర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయక పోవడం శోచనీయం. ఈ ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు అందజేశాం. ఇప్పటికైనా ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.

– మచ్చ నర్సయ్య, సామాజిక కార్యకర్త

వైభవంగా హనుమంతుడి ఉత్సవాలు



పూజలు చేస్తున్న మీలా మహదేవ్, తదితరులు

తాళ్లగడ్డ(సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీహనుమాన్ జయంతి పంచాహ్నిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజ, అలంకరణ, సహస్రనామావళి పారాయణం, లక్షమల్లెల పుష్పార్చన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు దరూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష మల్లెల పుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ దంపతులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మణరావు, దరూరి శ్రీధరాచార్యులు, దరూరి పవన్ కుమారాచార్యులు, దరూరి శ్రీకాంతాచార్యులు, భక్తులు వెంపటి సురేష్, పబ్బా ప్రకాష్, పబ్బా రామమూర్తి, పురం నాగరాజు, దేవేంద్ర చారి, తొనుకునూరి వెంకటేశ్వర్లు, గజ్జి కృష్ణయ్య, బొమ్మిడి శ్రీనివాస్, రాచర్ల కమలాకర్, లింగమంతుల స్వామి దేవాలయం చైర్మన్ పోలెబోయిన నరసయ్య యాదవ్, గుండా గోపికృష్ణ, నోముల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష తమలపాకులతో అర్చన..

వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు దరూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఆరాధన, నైవేద్యం, నివేదన, లక్ష తమలపాకుల అర్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నకిలీ వైద్యులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పీవైఎల్ నాయకులు

సూర్యాపేట అర్బన్ : నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సక్క అన్నారు. మంగళవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నకిలీ డాక్టర్ల మూలంగా ప్రజల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం హాస్పిటల్స్, డాక్టర్ల సర్టిఫికెట్లు పరిశీలించి అనుమతి ఇవ్వాల్సిన డీఎంహెచ్‌ఓ చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఆస్పత్రులను వెంటనే సీజ్ చేయాలని, అవినీతి డీఎంహెచ్‌ఓపై సమగ్ర విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు బండి రవి, జిల్లా సహాయ కార్యదర్శి వీరబోయిన రమేష్, డివిజన్ నాయకుడు దూదిపాళ ప్రవీణ్ పాల్గొన్నారు.

నకిలీ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి

తుంగతుర్తి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ డాక్టర్లు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతూ నిలువు దోపిడీ చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నెల రోజులుగా ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపగాని శ్రీనివాస్, గునగంటి యాదగిరి, గోపగాని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలి



తుంగతుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మద్దిరాలలో..



నూతనకల్‌లో..



పెన్‌పహాడ్ : రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

తుంగతుర్తి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా కాంటాలు అయ్యేలా చూడాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు . మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతం 17శాతం లోపు ఉండేలా ఆరబెట్టాలని రైతులకు సూచించారు. రైతులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు తెలిపారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ దయానందం, ఆర్ఐ శ్రీనివాస్, ఐకేపీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రామచంద్రపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు తేమశాతం వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు కాంటాలు వేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆయా కేంద్రాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ డీఎం ప్రసాద్, తహసీల్దార్ అమీన్ సింగ్, సీసీ నాగర్జున్‌రెడ్డి, వీబీకేలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం ఎగుమతులను వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పి ఉంచాలని రైతులకు సూచించారు. కాంటాలు నిర్వహించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి, దిగుమతి అయిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో నగదు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఇందిర, ఏఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతులను త్వరగా పూర్తి చేయాలి

పెన్‌పహాడ్ : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీల్లోని ధాన్యం దిగుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటసాయి రైస్ మిల్లును ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పెన్‌పహాడ్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిగిలిన ధాన్యం మొత్తాన్ని శ్రీ వెంకటసాయి రైస్ మిల్లుకు ట్యాగింగ్ చేయించి రెండు, మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం ప్రసాద్, తహసీల్దార్ లాలు, ఏపీఎం అజయ్‌నాయక్ పాల్గొన్నారు.

ఈటూరులో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



ఈటూరులో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

నాగారం : మండల పరిధిలోని ఈటూరులో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాల ముగింపులో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ప్రజల్లో భక్తిభావం పెంపొంది, ఐకమత్యం పెరుగుతుందన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.50,000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవ కమిటీ కన్వీనర్, తిరుమలగిరి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, నాయకులు సుంకరి జనార్దన్, కడియం పరమేశ్వర్, పసుపులేటి వెంకట్‌రెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, భిక్షపతి, ఎల్సోజు నరేష్, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిషోర్ పూజలు..

ఈటూరులో బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ మహోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని అన్నారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్యగౌడ్, ఎస్ఏ రజాక్, కొమ్మినేని సతీష్, చిల్లర చంద్రమౌళి, గొడిశాల యాదగిరి, పేరాల యాదగిరి, గంట నర్సిరెడ్డి, తాటికొండ సీతయ్య, గుండగాని సోమేష్, తీగుల్ల యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యం



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

నూతనకల్ : సమాజంలోని పేదలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని క్లబ్ అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ సూర్యాపేట ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించడం కోసం క్లబ్ కృషి చేస్తుందని తెలిపారు. ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 100మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించుటకు సూర్యాపేట లయన్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్, లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ షేక్ నాగుల్‌మీరా, బందు కృష్ణయ్య, సాబాది వెంకటరెడ్డి, మహ్మద్ ఇమామ్‌అలీ, నాగం సుధీర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజాభరోసా



మాట్లాడుతున్న ఎస్ఐ బాలునాయక్

తాళ్లగడ్డ(సూర్యాపేట) : రాయినిగూడెం గ్రామంలో మంగళవారం పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలునాయక్ మాట్లాడారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కట్టా సుదర్శన్, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, గురు లింగం, నాగార్జున, కృష్ణ పాల్గొన్నారు.

కుమారి మృతి బాధాకరం

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు సతీమణి కుమారి (50) మృతి బాధాకరమని పలువురు సీపీఎం నాయకులు అన్నారు. కుమారి గత కొంతకాలంగా అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కుమారి మృతి పట్ల నాయకులు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

బాధితులకు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన బొడ్డు వెంకన్న, జీడి విజయ్ అనారోగ్యానికి గురికాగా మంగళవారం వారిని గ్రామంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు మారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, బొడ్డు రామలింగయ్య, కందుల దశరథరామారావు, చల్ల వేణుధర్‌రెడ్డి, బొడ్డు సోమరాజు, తండు లింగమూర్తి, సందీప్‌రెడ్డి, సత్యనారాయణ, జీడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

మునగాల : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మునగాల మండల కేంద్రంలో శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. హనుమంతుడి విగ్రహాన్ని రథంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తూముల వీరస్వామి, గంధం అంజయ్య పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం



నూతనకల్ : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నూతనకల్ : ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కూసు ఉప్పలయ్య, గంటా రామకృష్ణ, గోపాల్, నక్క ఎల్లయ్య, సుదర్శన్, ఎస్‌కె. జబ్బార్, సత్తయ్య, నాగయ్య పాల్గొన్నారు.

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, నాగెల్లి రామనర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మంగళవారం జరగాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గ ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షుడు మరికంటి ఉపేందర్, మాతంగి ఉప్పలయ్య, నాగెల్లి వెంకన్న, రాంపాక వెంకన్న, సతీష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ



తిరుమలగిరి: ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శాంతయ్య



అర్వపల్లిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ బాలునాయక్, ఆర్‌పీలు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య మంగళవారం ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞాన శాస్త్రంపై ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఓ శ్రీనివాసులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

అర్వపల్లి : విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ, కోర్సు డైరెక్టర్ బి.బాలునాయక్ కోరారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించే వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. నాలుగు సబ్జెక్టులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ శిక్షణను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఓ కుంభం ప్రభాకర్, ఆర్‌పీలు వి.సైదులు, కె.రమేష్, సీహెచ్.నాగరాజు, సృజన, భూపతి శ్రీనివాస్‌గౌడ్, ఎస్. వెంకన్న, బి.స్వరూపరాణి, పి.మల్లయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి రాములు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశ సంఖ్యను పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుప్పాల వీరన్న, మేడ సాయిలు, యామ సంతోష్‌కుమార్, కందిబండ కృష్ణవేణి, ఉప్పు నాగయ్య, పెసర రమేష్, వెంకన్న, కామిరిశెట్టి యాదగిరి పాల్గొన్నారు.

చివ్వెంల : విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేయాలని మండల విద్యాధికారి కళారాణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు పల్లె అనిల్, క్రాంతి కుమార్, మమత, దయాకర్, వరలక్ష్మి, భిక్షం, నజీర్, రమాదేవి, ఎల్ఎఫ్ఎల్, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : మాట్లాడుతున్న ఎంఈఓ



చివ్వెంల : మాట్లాడుతున్న ఎంఈఓ కళారాణి

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతూ నిరసన తెలుపుతున్న రైతులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని 1వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తగా మంగళవారం రైతులు ఆ మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యంతో పాటు లారీల కొరత వలన రైతులు ధాన్యం అమ్ముకోడానికి నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని చెప్పారు. తడిసిన ధాన్యంతోపాటు కేంద్రంలోని మొత్తం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : కుక్కడం గ్రామానికి చెందిన వెంకటవెల్లి రవి ఇటీవల మృతి చెందడంతో గ్రామానికి చెందిన అతడి మిత్రులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు మంగళవారం అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు, మృతుడి మిత్రులు కలిసి రూ.81వేలు, గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.30వేలను బాధిత కుటుంబ సభ్యులకు వేరువేరుగా అందజేశారు.

నూతనకల్ : యడవెల్లి గ్రామానికి చెందిన గాజుల కళమ్మ ఇటీవల మృతి చెందగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల తిర్మల్‌రావు మంగళవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొచ్చెర్ల బాబు, తూముల వెంకటేశ్వర్‌రావు, చల్లా జ్యోతి, గాజుల ఉపేందర్, వేల్పుల వెంకన్న, మల్లెబోయిన ప్రవీణ్ పాల్గొన్నారు.